# ఆకట్టుకున్న విన్యాసాలు

- ఆత్మరక్షణ, కర్రసాము, నాన్‌చాక్ శిక్షణలో రాణిస్తున్న విద్యార్థులు



కర్రసాము ప్రదర్శనలో విద్యార్థి

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండలంలోని దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు ప్రదర్శించిన ఆత్మరక్షణ విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రాణీ లక్ష్మీభాయి రక్షప్రశిక్షణ ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన విద్యార్థినీ, విద్యార్థులు ఏర్పాటు చేసిన పాఠశాల స్థాయి ప్రదర్శనలో శిక్షణ పాఠవాలను ప్రదర్శించారు. ఆత్మరక్షణ ప్రదర్శనలో భాగంగా పలువురు విద్యార్థులు తమ కఠోర శిక్షణ పూర్తి చేయగా, వారు ఇచ్చిన ప్రదర్శన అలరించడమే కాదు ఆకట్టుకుంది. కర్రసాము, నాన్‌చాక్, ఆత్మరక్షణ ఇలా పలు అంశాల్లో విద్యార్థుల ప్రదర్శన వారిలోని ప్రతిభను చాటింది. ఈ ప్రదర్శనలో నైపుణ్యతను ప్రదర్శించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు చేతుల మీదుగా ఆరెంజ్, యెల్లో బెల్ట్‌లతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శిక్షకుడు రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నాన్‌చాక్ ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

# గట్రావ్‌పల్లిలో పోలీసుల కార్డన్‌సెర్చ్



కల్వర్టు కింద తనిఖీ చేస్తున్న పోలీసులు

**కాసిపేట:** మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గట్రావ్‌పల్లిలో శనివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ ఫోర్స్‌తో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనులతో మాట్లాడి.. రాబోయే ఎన్నికల గురించి చర్చించారు. గ్రామంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, పోలీసులు కలిసి కవాతు నిర్వహించారు. ఎటువంటి అసాంఘిక శక్తులకు అవకాశం ఇవ్వవద్దని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఎవరైనా అనుమానితులు కనిపించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, 12 మంది సీఆర్పీఎఫ్ బృందం, 8 మంది సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

# రక్తదాతలు.. ఆపద్బాంధవులు



పాతమంచిర్యాల: రక్తదానం చేస్తున్న హరిప్రసాద్



శ్రీరాంపూర్: రక్తదానం చేస్తూ...

**పాతమంచిర్యాల:** అన్ని ధానాలలోకెల్ల రక్తదానం గొప్పదని, రక్తదాతలు.. ఆపద్బాంధవులు అని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్ అన్నారు. పట్టణంలోని జననీ వలంటరీ బ్లడ్ బ్యాంక్‌లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వారు మాట్లాడారు. రక్తదానం వల్ల అత్యవసర సమయాల్లో ఇతరుల ప్రాణాలు కాపాడిన వారమౌతామన్నారు. ఈ సందర్భంగా అఖిల గాండ్ల తేలికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, స్వప్న దంపతులు వారి పెళ్లి రోజు సందర్భంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు జననీ వలంటరీ బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు రూ.1 లక్ష ఇన్సూరెన్సు పత్రాలను అందించారు. కార్యక్రమంలో అఖిల గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్కల విజయ్‌బాబు, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు వెన్నంపల్లి సతీశ్, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు శ్రీపతి, రవి, రాజేష్, బాబు, రేణుక, హరితేజ సేవాదళం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రక్తదానం**

**శ్రీరాంపూర్:** సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్ ఆర్కే 8 డిస్పెన్సర్‌లో రక్తదానం నిర్వహించారు. ఆదివారం జరిగే అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీజీఎం (ఐఈడీ) చిరంజీవి, ఎస్సీ లైసెన్ అధికారి కిరణ్ కుమార్‌లో పాల్గొని రక్తదానం చేసిన వారిని అభినందించారు. వారికి సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్ కుమార్, నాయకులు సుమన్, రాజేష్, రాజు నాయక్, లక్ష్మణ్, విక్కీ, కమల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ముల్కలపేటలో పోలీసు కళాజాత



మాట్లాడుతున్న ఎస్సై శ్యాంపటేల్

**వేమనపల్లి:** ముల్కలపేట గ్రామపంచాయతీ కేంద్రంలో నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో శనివారం కళాజాత నిర్వహించారు. మూఢనమ్మకాలు, మహిళా చట్టాలు, సాంఘిక దురాచారాలు, బాల్య వివాహాలు, గంజాయి, సైబర్ నేరాల నియంత్రణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత కళాకారులు ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు పాల్గొన్నారు.

### నేడు చెన్నూర్‌లో ర్యాలీ

**చెన్నూర్:** పట్టణంలో ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు తగరం వెంకటి తెలిపారు. ఉదయం 8 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అంబేద్కర్ వాదులు, ఉపాధ్యాయ, ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

### అటవీ సంరక్షణపై అవగాహన



కూలీలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్వో

**దండేపల్లి:** మండలంలోని తాళ్లపేట గ్రామంలో ఉపాధి కూలీలకు అటవీ సంరక్షణపై డీఆర్వో ప్రమోద్‌కుమార్ శనివారం అవగాహన కల్పించారు. వేసవి సమయంలో అటవీ ప్రాంతాలకు వెళ్తే మంటలు కనిపిస్తే అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. లేదంటే చల్లార్పడం మంచిదన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో గోవింద్, ఎఫ్‌బీవో అమృతరావు, బేస్‌క్యాంపు సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

### పరీక్ష ప్యాడ్ల అందజేత

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుడు మేకల రామస్వామి 6, 7వ తరగతి చదువుతున్న 27మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్యాడ్లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### తైబజార్ రద్దుపై హర్షం

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని చిరు వ్యాపారస్తుల నుంచి వసూలు చేస్తున్న తైబజార్‌ను రద్దు చేయడంపై శనివారం మార్కెట్‌లో చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూరగాయల చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తైబజార్‌ను రద్దు చేయడం వల్ల, చిరువ్యాపారస్తులకు లాభం చేకూరుతుందని, దీనిని తామందరం స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు జగన్మోహన్, జోగుల సదానందం పాల్గొన్నారు.

### 'తాగునీటి సమస్య తలెత్తొద్దు'



ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

**శ్రీరాంపూర్:** వేసవి దృష్ట్యా నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తొద్దని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి ఇబ్బందులపై శనివారం ఆయన ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక కార్యచరణ చేపట్టి తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రతి వార్డులో పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వాటిని తక్షణమే బాగు చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సరఫరా జరగడం లేదని తెలిస్తే వెంటనే అక్కడికి వెళ్లి ఆ సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టసభల్లో బీసీలకు వాటా ఇవ్వాలి

- బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్

**చెన్నూర్:** చట్ట సభలో బీసీలకు వాటా ఇవ్వాలని బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్ అన్నారు. బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్యయాత్ర శనివారం చెన్నూర్‌కు చేరింది. బీసీ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక పద్మశాలీ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలు అధికంగా ఉన్నప్పటికీ, రాజ్యాధికారం అగ్ర వర్ణాల చేతిలోకి వెళ్తుందన్నారు. బీసీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నీరెటి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల అంజన్న, కార్యదర్శి చిందం వెంకటేశ్, ప్రచార కార్యదర్శి రాజు, నాయకులు గుండెటి మధు, పిట్టల రవి, పేరాల సుదర్శన్, బాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కేతన్‌పల్లికి చేరిన బీసీ ప్రజా చైతన్య యాత్ర**



వేమనపల్లి మండలం కేతన్‌పల్లిలో...

**వేమనపల్లి:** బీసీ చైతన్యయాత్ర శనివారం వేమనపల్లి మండలం కేతన్‌పల్లి గ్రామానికి చేరింది. బీసీల హక్కుల సాధన కోసం అవగాహన కల్పిస్తూ బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్ ఆధ్వర్యంలో ఈ యాత్ర కొనసాగుతుంది. కోటపల్లి మండలం అర్జునగుట్ట, పారిపల్లి, లింగన్నపేట, ఆల్గాం, వెంచపల్లి మీదుగా మండలంలోని కల్మలపేట, నీల్వాయి, కేతన్‌పల్లి నుంచి కోటపల్లి మండలం మల్లంపేట తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఐక్య వేదిక బీసీ ప్రజాచైతన్య యాత్ర ముగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీసీ నాయకులు దుర్గయ్య, రామన్న, బాపురావు పాల్గొన్నారు.

**బహిరంగ సభ విజయవంతం చేయండి**

**మందమర్రిరూరల్:** ఈ నెల 15న మందమర్రి మార్కెట్ ఏరియాలో బీసీ ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని బీసీ ఐక్య వేదిక జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో ఎక్కువగా బీసీలు ఉన్నారని, బీసీల కులగణన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మెజార్టీ జనాభా ఉన్నటువంటి బీసీలకు సామాజిక వాటా, రాజకీయాల్లో పదవులు దక్కడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. బహిరంగ సభకు సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రొఫెసర్, బీసీ కులాల తత్వవేత్త మురళీమనోహర్, అడ్వకేట్ పేరం అలేఖ్య హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాజే శం, సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, రామోజు కొండయ్య, పోలు శ్రీనివాస్, నామని ముత్తయ్య, నర్సోజీ ఉన్నారు.

# ఘనంగా సుందరకాండ హోమం



హోమం నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు

**బెల్లంపల్లిరూరల్:** బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర దేవాలయంలో శనివారం సుందరకాండ హోమం ఘనంగా జరిగింది. హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో సుందరకాండ హోమం నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకం చేపట్టారు. ఆలయ పూజారి కొమ్మెర మహాదేవ శర్మ, వేద పండితులు రాంపల్లి దశరథ రామ్ శర్మల పవిత్ర వేద మంత్రోచ్ఛరణల నడుమ సుందరకాండ హోమాన్ని కనులపండువగా నిర్వహించారు. అంతకు ముందు గణపతి పూజ, హనుమాన్ చాలీసా, దండకం పారాయణం చేపట్టారు. హోమం కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ భక్తులు భజనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# సామూహిక బిక్షలో హనుమాన్ భక్తులు



తాండూర్: పూజలో పాల్గొన్న దీక్షాపరులు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీలోని నూతన అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో శనివారం హనుమాన్ మాలధారణ భక్తులకు బిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నంనూర్ గ్రామంలోని పలువురు భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సామూహిక భిక్షలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

**హనుమాన్ దీక్షా మాలధారణ**

**దండేపల్లి:** మండలంలోని గూడెం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు హనుమాన్ దీక్షా మాల ధారణ చేసుకున్నారు. 680 మంది మాలలు ధరించినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం గుట్టపై గల సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు.

**అంజన్నకు అభిషేకం**

**తాండూర్:** మండలంలోని మాదారం టౌన్‌షిప్ కోదండ రామాలయ ఆలయ ప్రాంగణంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఆంజనేయ స్వామికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు అవధూత శర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆంజనేయస్వామి దీక్ష మాల ధారులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

**అఖండ భజన**

**మందమర్రిరూరల్:** పట్టణంలోని పాలచెట్టు వద్ద గల పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు కృషష్ణకాంతచారి ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**చలివేంద్రాలు ప్రారంభం**

**మంచిర్యాలటౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేస్టేషన్ ఎదురుగా, వినాయక టెంపుల్ ముందు హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారంభించారు.

**జయంతి వేడుకలకు ప్రొఫెసర్లు రాక**

**దండేపల్లి:** మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, ప్రొఫెసర్ జాడి మురళీధర్ రానున్నట్లు అంబేద్కర్ మండల కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఉచిత కంటి చికిత్స వైద్య శిబిరం**

**నెన్నెల:** మండలంలోని చిత్తాపూర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల రూట్ లక్ష్మీనగర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. 50 మందికి పరీక్షలు నిర్వహించారు. 30 మందిని కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. త్వరలోనే లయన్స్ ఐ ఆసుపత్రి రేకుర్తి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించడానికి ప్రణాళిక చేశారు. రీజినల్ చైర్‌పర్సన్ లయన్ కే. సుగుణాకర్ రెడ్డి, జోనల్ చైర్ పర్సన్ లయన్ గుర్రాల చక్రధర్‌రావు, ప్రెసిడెంట్ లయన్ చైతన్య చంద్రరాజు, సెక్రటరీ మధుకర్, కోశాధికారి గౌరోజు శ్రీధర్ పాల్గొన్నారు.

**బీజేపీలో చేరిక**

**వేమనపల్లి:** మండలంలోని నీల్వాయికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏట మధుకర్, కోయిల స్వామిలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, మండల అధ్యక్షుడు బైస మల్లేష్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ పాలనకు ఆకర్షితులమై బీజేపీలో చేరినట్లు చెప్పారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం తమవంతు కృషి చేస్తామన్నారు.

**పరీక్షలకు సిద్ధం**

**దండేపల్లి:** 1 నుంచి 9వ తరగతి వరకు ఈ నెల 15 నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో పాఠశాలల వారీగా పరీక్ష పత్రాలను ఎంఐఎస్ నగేష్ ఆధ్వర్యంలో శనివారం సీఆర్పీలు సిద్ధం చేసి పాఠశాలలకు చేరవేశారు. సీఆర్పీలు నర్సయ్య, రమేష్, రాజ్‌మహమ్మద్, శ్రావణ్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఏఎస్సై

**మంచిర్యాలఅర్బన్:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏఎస్సై పీ.వెంకన్నగౌడ్ అన్నారు. స్థానిక పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సైబర్ అంబాసిడర్ ఫ్లాట్ ఫామ్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన సైబర్ అంబాసిడర్లకు బ్యాడ్జీలు అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ అంబాసిడర్ ఫ్లాట్ ఫామ్‌ను ఏర్పాటు చేసి, జిల్లాలోని వివిధ పాఠశాలలో పాఠశాలకు ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సైబర్ అంబాసిడర్ బ్యాడ్జీలతో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో, ఆయా వార్డు పరిధిలోని ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బంధువుల, స్నేహితులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి రోజూ సైబర్ నేరాలపై అవగాహన కలిగించే మెస్సేజ్‌లు, వీడియోలు పెడుతూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాళవిదేవి, సైబర్ అంబాసిడర్ల శిక్షణ అందించిన ఆడిచర్ల సాగర్, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పల్సర్ బైక్ లాంచ్



పల్సర్ 150 అప్‌గ్రేడ్ మోడల్ లాంచ్

**మంచిర్యాలటౌన్:** జిల్లా కేంద్రంలోని మహి బజాజ్ షోరూంలో కొత్త పల్సర్ 150 అప్‌గ్రేడ్ మోడల్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా షోరూం జనరల్ మేనేజర్ పి.సుందర్ మాట్లాడుతూ.. నూతనంగా లాంచ్ చేసిన పల్సర్ బైక్ ఎక్స్ షోరూం ధర రూ.1,12,301గా కంపెనీ నిర్ణయించిందని, దీనిలో బ్లూటూత్, యూఎస్‌బీ, డిజిటల్ కన్సోల్, ఆకర్షణీయమైన కొత్త గ్రాఫిక్స్‌తో విడుదల చేయగా, మూడు రంగులలో లభ్యమవుతుందని తెలిపారు. ఈ సరికొత్త మోడల్ యూత్‌తో పాటు ఫ్యామిలీ కస్టమర్లకు కూడా నచ్చుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండి రమేశ్ రెడ్డి, కస్టమర్లు పాల్గొన్నారు.

# టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**బెల్లంపల్లి:** రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయం ఆవరణలో వేడుకలను నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా సీనియర్ నాయకుడు జి.ప్రకాష్ పతాకావిష్కరణ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జి.చక్రపాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం చిత్తశుద్ధితో పోరాటాలు సాగించాల్సి ఉందని వివరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమం ధ్యేయంగా కృషి చేయాల్సి ఉందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేయడానికి వెనుకాడబోమన్నారు. అనంతరం మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు బబిత, దేవదాస్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రవి కుమార్, సంఘ బాధ్యులు రమేష్, చక్రవర్తి, నాగరాజు, సతీష్, స్వర్ణలత, సునీత, సుజాత, సునంద దేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం



పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న గ్రామస్తులు

**దండేపల్లి:** మండలంలోని ద్వారక గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వరకు జరగనున్నాయి. మొదటి రోజు గంగా సేకరణ, శాల ప్రవేశం, గణపతి పూజ, రక్షా బంధనం కార్యక్రమాలు ప్రతిష్ఠాపణ చార్యులు రవి ప్రత్యేగాత్మ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు.

## డీజీఎంకు పితృ వియోగం

**శ్రీరాంపూర్:** ఏరియా క్వాలిటీ డీజీఎం కే.వెంకటేశ్వ రెడ్డికి పితృ వియోగం జరిగింది. వెంకటేశ్వర్‌రెడ్డి తండ్రి ఎల్లారెడ్డి(80) కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. శనివారం వారి స్వగ్రామమైన కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ సమీపంలోని కనుకుల గిద్దేలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్సార్పీ 3 గని మేనేజర్ సంతోశ్‌కుమార్, ఐఎన్టీయూసీ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు అంత్యక్రియలకు హాజరై వెంకటేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు.

# బాధిత కుటుంబానికి పోలీసుల భరోసా



సాయం అందిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు

**కాసిపేట:** మండలంలోని మల్కెపల్లిలో నాలుగు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో కుడిమెత రాంచందర్ ఇళ్లు పూర్తిగా కాలిపోగా శనివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, ఆ కుటుంబానికి భరోసా అందించారు. 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.5 వేల నగదు ఆ కుటుంబానికి అందించి మానవతా దృక్పతాన్ని చాటుకున్నారు. రక్షణ కల్పించేందుకే కాకుండా, ఎల్లప్పుడు సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు తాము ముందుంటామని పోలీసులు చాటిచెప్పారు. గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.